క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో మండల పూజ

అమరాపురం: మండలంలోని హేమావతి గ్రామంలో అయ్యప్ప మాలధారులు ఆదివారం అయ్యప్పస్వామి మండల పూజను ఘనంగా నిర్వహించారు. స్థానిక సిద్ధేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ట్రాక్టర్లలో స్వామి వారి చిత్రపటాన్ని ఉంచి పూజల అనంతరం గ్రామ వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. అనంతరం వచ్చిన భక్తులకు ప్రసాద వినియోగం చేశారు.

పుట్టపర్తికి భక్తుల పాదయాత్ర



కాలినడకన పుట్టపర్తికి వెళ్తున్న భక్తులు

రొద్దం: మండల కేంద్రం నుంచి పుట్టపర్తి బాబా సమాధిని దర్శించుకోవడానికి ఆదివారం తెల్లవారు జామున 3 గంటలకే పలువురు భక్తులు పాదయాత్రగా తరలివెళ్లారు. కాలినడకన వెళ్లి సత్యసాయి సమాధిని దర్శించుకుంటే మంచి జరుగుతుందన్న నమ్మకంతో పాదయాత్రగా వెళ్తున్నట్లు భక్తులు తెలిపారు. కార్యక్రమంలో పలువురు సత్యసాయి సేవా సమితి సభ్యులు ఉన్నారు.

కాంగ్రెస్ నుంచి జేడీఎస్‌లోకి..

పావగడ: స్థానిక విధాన సభ ఎన్నికలు సమీపిస్తుండడంతో చేరికల ప్రక్రియ జోరుగా సాగుతోంది. ఆదివారం తాలూకాలోని రొప్పం గ్రామంలో అధిక సంఖ్యలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు జేడీఎస్ పార్టీలోకి చేరారు. మాజీ అధ్యక్షుడు వెంకటరమణస్వామి, నాయకులు మహ్మద్ ఫరూక్, మార్జన్, మునావర్, డ్రైవర్ బాబా, సుబ్రమణి, బేల్దార్ సంజీవరాయప్ప, నాగోజప్ప, ఇనాయతుల్లా, నాగణ్ణ, సుబ్బరాయప్ప, హరీష్, నాగభూషణ, రమేశ్ తదితరులు జేడీఎస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే తిమ్మరాయప్ప పార్టీ కండువా కప్పి వారిని జేడీఎస్‌లోకి ఆహ్వానించారు.

మహిళలకు చీరల పంపిణీ



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న దృశ్యం

లేపాక్షి: మండలంలోని చోళసముద్రం చౌడేశ్వరిదేవి ఆలయం వద్ద వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణస్వామి పుట్టిన రోజుతో పాటు నూతన సంవత్సరం సందర్భంగా ఆదివారం 250 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఎంపీపీ వెంకటరత్నమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీలు అంజినరెడ్డి, నీలావతి, సర్పంచులు నందిని, ఆదినారాయణ, అశ్వర్థనారాయణ, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలసిన కురుబ సంఘం నాయకులు

పెనుకొండ: మాజీ మంత్రి , ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ పుట్టిన రోజు, నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని పలువురు కురుబ సంఘం నాయకులు పట్టణంలోని ఎమ్మెల్యే స్వగృహంలో కలసి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన సంవత్సర శుభాకాంక్షలతో పాటు, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

స్ప్రింక్లర్ పైపుల చోరీ

ధర్మవరం అర్బన్: మండలంలోని తుమ్మల గ్రామానికి చెందిన రైతు గొర్ల నారాయణ రెడ్డి పొలంలోని 35 స్ప్రింక్లర్ పైపులను శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఈ విషయంపై స్థానిక రూరల్ పోలీసులకు బాధితుడు గొర్ల నారాయణరెడ్డి ఆదివారం ఫిర్యాదు చేశారు.

యువకుడికి గాయాలు



వెంకటేశ్‌కు ప్రథమ చికిత్స అందిస్తున్న 108 సిబ్బంది

ఎన్పీకుంట: మండల కేంద్రానికి సమీపంలోని వంకమద్ది క్రాస్ సమీపంలోని ఓ కల్వర్టు వద్ద ఆదివారం తెల్లవారుజామున ద్విచక్ర వాహనం అదుపు తప్పిన ఘటనలో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. బందారుచెట్లపల్లికి చెందిన వెంకటేశ్ తెల్లవారుజామున మండల కేంద్రానికి వస్తుండగా ద్విచక్ర వాహనం అదుపుతప్పింది. ఈ ఘటనలో కల్వర్టులో పడి తీవ్రంగా గాయపడ్డాడు. 108 సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని ప్రథమ చికిత్స అందించారు. అనంతరం కదిరి ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు ఈఎంటీ సాంబశివ, పైలట్ లోకేశ్వర తెలిపారు.

తనకల్లులో..

తనకల్లు: స్థానిక సాయిబాబా గుడి సమీపంలో ఆదివారం ద్విచక్ర వాహనం అదుపుతప్పిన ఘటనలో ఈతోడుకు చెందిన పతి అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పతి వ్యక్తిగత పని మీద కొక్కంటి క్రాస్‌కు వెళ్తుండగా.. ఒక్కసారిగా బైక్ అదుపు తప్పడంతో రోడ్డుపై పడ్డాడు. ఈ ప్రమాదంలో ఆయన ముఖం, చేతులకు బలమైన గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రుడిని చికిత్స కోసం తనకల్లు 30 పడకల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

మాట తప్పని నాయకుడు జగన్

- నూతన పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యే శంకరనారాయణ, ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్



హిందూపురం: పెంచిన పింఛన్ మొత్తాన్ని లబ్ధిదారులకు అందజేస్తున్న ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్

హిందూపురం టౌన్: ఇచ్చిన మాట తప్పకుండా ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న నాయకుడు దేశ చరిత్రలోనే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఒక్కరేనని ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ అన్నారు. నవరత్నాల్లో భాగంగా పింఛన్ కానుకను రూ.2,500 నుంచి రూ.2,750కు పెంచడంతో పెంచిన పింఛన్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం పట్టణంలోని 23వ వార్డు సచివాలయంలో కౌన్సిలర్ అయూబ్ అధ్యక్షతన పింఛన్ పంపిణీ చేపట్టగా ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్, చైర్‌పర్సన్ ఇంద్రజ పాల్గొని లబ్ధిదారులకు పెంచిన పింఛన్ మొత్తాన్ని అందజేశారు. ఎమ్మెల్సీ ఇక్బాల్ మాట్లాడుతూ అవ్వా, తాతలు, వితంతువులు, ఒంటరి మహిళలకు ఆసరాగా నిలవాలనే సీఎం వైఎస్ జగన్ పింఛన్ మొత్తాన్ని పెంచి వారి మోముల్లో చిరునవ్వులను పూయించారన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక టీడీపీ నాయకులు మాయమాటలతో ప్రజలను మభ్యపెట్టేందుకు యత్నిస్తున్నారని, ప్రజలు వారిని నమ్మకూడదన్నారు. వలంటీర్లు, సచివాలయల వ్యవస్థ ద్వారా కుల, మత, రాజకీయ, ప్రాంత భేదాలు లేకుండా అర్హులను గుర్తించి సంక్షేమ పథకాలను వారి ఇంటి గడప వద్దకే వెళ్లి అందిస్తున్నామన్నారు. టీడీపీ హయాంలో పింఛన్ కోసం రోజుల తరబడి పడిగాపులు కాసే అవసరం లేకుండా వలంటీర్లు ప్రతి నెలా 1న తెల్లవారు జామునకే లబ్ధిదారుల ఇంటి తలుపు తట్టి పింఛన్ మొత్తాన్ని అందజేస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేసి మిఠాయిలను పంచిపెట్టారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మారుతీరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బసిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, సుభాష్ గాంధీ, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ: అవ్వాతాతలంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎనలేని ప్రేమ అని, వారిని ఆదుకోవడానికే పింఛన్‌ను రూ.2,750కు పెంచారని ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ అన్నారు. ఆదివారం పట్టణంలోని కోనాపురం రహదారిలో మహానేత వైఎస్. రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి జగన్ మరోసారి పింఛన్ పెంచి ఇచ్చిన మాటను నిలుపుకున్నారన్నారు. చంద్రబాబుకు ఓటేస్తే ఇచ్చిన హామీలన్నీ కాలరాసి పేదల బతుకుల్లో అంధకారం నింపుతారని, ఆయన మాటలను ఎవరూ నమ్మవద్దన్నారు. హామీలన్నీ అమలు చేస్తున్న సీఎం జగనన్నకు ప్రజలు అండగా నిలవాలన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ కన్వీనర్‌లు బోయ నరసింహ, నాగలూరు బాబు, ఎంపీపీ గీత, జెడ్పీటీసీ శ్రీరాములు, నగర పంచాయతీ చైర్మన్ ఉమర్‌ఫారూక్‌ఖాన్, వైస్‌చైర్మన్ సునీల్, జయశంకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రొద్దం: వృద్ధులకు, వింతువులకు, ఒంటరి మహిళలకు, చేనేత తదితర పింఛన్లు పెరడంతో లబ్ధిదారుల్లో ఆనందం వ్యక్తం మవుతోంది. పెంచిన రూ 2,750 పింఛన్‌ను ఆదివారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. హామీ మేరకు సీఎం జగన్ పింఛన్లు పెంచారని ఎంపీపీ చంద్రశేఖర్ అన్నారు. మండలంలో 7,454 పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్ చెప్పారు. ఆదివారం సాయంత్రం 5 గంటల దాకా 80 శాతం పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాధవి శ్రీనివాస్, కలిపి పీఏసీఎస్ చైర్మన్ కేపీ శ్రీనివాసులు, మాజీ సింగిల్ విండో చైర్మన్ రాజారెడ్డి, వలంటీర్లు పాల్గొన్నారు.

అమరాపురం: మండలంలో ఆదివారం వలంటీర్, సచివాలయం కన్వీనర్లు సమన్వయంతో సామాజిక పింఛన్లను పంపిణీ చేశారు. కొత్తగా రూ.250 పెంచడంతో మొత్తం రూ.2,750 సొమ్మును అందజేశారు. దీంతో లబ్ధిదారులు ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. 15 గ్రామ సచివాలయాల పరిధిలోని పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు నారాయణ, నాగరాజు, ప్రసాద్, తిప్పేస్వామి, రాజేశ్వరి, నరసింహప్ప, మంజునాథ, శివలింగప్ప, సదానందగౌడ, పుట్టలింగప్ప, ప్రేమ్‌కుమార్, జయమ్మ, తిప్పేస్వామి, కెంచప్ప పాల్గొన్నారు.



అమరాపురం: తోటలో కూలికి పింఛన్ అందజేస్తున్న దృశ్యం

మడకశిరరూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వైఎస్సార్ పెన్షన్ కానుకను పెంచడంతో అవ్వా తాతల్లో ఆనందం వెల్లి విరిసిందని జెడ్పీటీసీ సరోజమ్మ తెలిపారు. జమ్మానిపల్లిలో జెడ్పీటీసీ సరోజమ్మ వలంటీర్‌తో కలిసి ఇంటింటికీ వెళ్లి పెంచిన రూ.2,750ను లబ్ధిదారులకు అందజేశారు. పంపిణీ కార్యక్రమంలో వలంటీర్లు, ఉద్యోగులు ,ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

పింఛనే నాకు అండ

భర్త చనిపోయి ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయాను. నాకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అందిస్తున్న పింఛన్ అండ. ఒకటో తేదీనే ఠంచనుగా పింఛన్ అందిస్తుండటం చాలా ఆనందంగా ఉంది. మాలాంటోళ్లకు జగనన్న అందిస్తున్న సాయం మరువలేం.

– లక్ష్మి, కటికరవీధి, పెనుకొండ

కార్యకర్తలకు అండగా ఉంటా

- ఏపీ ఆగ్రోస్ చైర్మన్ నవీన్‌నిశ్చల్



వైఎస్సార్‌సీపీ మహిళా కార్యకర్తలకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఆగ్రోస్ చైర్మన్ నవీన్‌నిశ్చల్

హిందూపురం టౌన్: వైఎస్సార్‌సీపీని నమ్ముకున్న కార్యకర్తలకు ఎల్లప్పుడు అండగా ఉంటానని ఏపీ ఆగ్రోస్ చైర్మన్ నవీన్‌నిశ్చల్ అన్నారు. ఆదివారం నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని స్థానిక ప్రశాంత్‌నగర్‌లోని ఆగ్రోస్ చైర్మన్ కార్యాలయ ఆవరణలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు దుస్తుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌ను కట్ చేసిన అనంతరం కార్యకర్తలకు దుస్తులు పంపిణీ చేశారు. నవీన్‌నిశ్చల్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో నూతన సంవత్సరంలో హిందూపురం ప్రజలందరికీ మరింత మంచి జరుగుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఏకతాటిపైకి వచ్చి రాబోయే ఎన్నికల్లో హిందూపురంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరవేసేందుకు కృషి చేయాలన్నారు. వైఎస్సార్‌సీపీలో తప్పకుండా ప్రతి కార్యకర్తకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. మన పార్టీని మనం కాపాడుకుంటూనే, ప్రతిపక్ష టీడీపీపై ప్రజాస్వామ్య పద్ధతిలో యుద్ధం చేయాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కలసి కట్టుగా కృషి చేయాలన్నారు. హిందూపురంలోని ప్రింట్, ఎల్రక్టానిక్ మీడియా ప్రతినిధులకు కూడా నూతన సంవత్సరం సందర్భంగా చిరు కానుకలను అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఇర్షాద్, ఎంపీటీసీ షమీమ్ తాజ్, వైఎస్సార్‌సీపీ నాయకులు నరసింహారెడ్డి, ఫజులు రెహమాన్, తిప్పేరుద్రయ్య, నారాయణస్వామి, ఆనంద్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే జన్మదినం



పుట్టినరోజు సందర్భంగా వైఎస్సార్‌సీపీ శ్రేణుల మధ్య కేక్‌కట్ చేస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

పెనుకొండ: మాజీ మంత్రి, ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడు మాలగుండ్ల శంకరనారాయణ జన్మదిన వేడుక ఆదివారం ఘనంగా జరిగింది. క్యాంపు కార్యాలయానికి వైఎస్సార్‌సీపీ నాయకులు పోటెత్తారు. పెనుకొండ నియోజకవర్గం నుంచే కాకుండా జిల్లా వ్యాప్తంగా ఉన్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు తరలివచ్చి శంకరనారాయణకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేక్ కట్ చేశారు. గజమాలలతో ఎమ్మెల్యేను సత్కరిస్తున్న పలువురు నాయకులు తమ అభిమానాన్ని చాటుకున్నారు.

వైకుంఠ ఏకాదశికి ఆలయాల ముస్తాబు



లక్ష్మీపురంలోని బాలాజీ ఆలయాన్ని అలంకరించిన దృశ్యం

హిందూపురం టౌన్: ముక్కోటి వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని పట్టణంలోని ఆలయాలు ముస్తాబయ్యాయి. పట్టణంలోని ప్రసిద్ధ పేట వెంకటరమణస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా భక్తుల తాకిడిని దృష్టిలో ఉంచుకుని భక్తులకు ఇబ్బంది కలగకుండా బ్యారికేడ్లతో క్యూలైన్లను ఏర్పాటు చేశారు. భక్తులు ఉత్తర ద్వారం గుండా ప్రవేశించి స్వామిని దర్శించుకునేలా అన్నీ సిద్ధం చేశారు. సోమవారం తెల్లవారు జామున 4.40 గంటలకు ఉత్తర ద్వారం తెరవనున్నారు. అలాగే లక్ష్మీపురంలోని బాలాజీ ఆలయం, మున్సిపల్ కార్యాలయం వద్ద గల శ్రీనివాస మందిరాన్ని కూడా ముస్తాబు చేశారు.



పేట వెంకటరమణస్వామి ఆలయం వద్ద క్యూలైన్ ఏర్పాటు చేసిన దృశ్యం



హిందూపురం: ఎమ్మెల్సీ ఇక్బాల్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేస్తున్న దృశ్యం



ఎమ్మెల్యే శంకరనారాయణకు కేక్ తినిపిస్తున్న నాయకులు



మడకశిరరూరల్: కేక్‌కట్ చేసి సతీమణికి తినిపిస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

సంబరంగా న్యూఇయర్

నూతన సంవత్సర వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. మడకశిర, పెనుకొండ, హిందూపురం నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో న్యూఇయర్‌ను జరుపుకున్నారు. ముఖ్యంగా ఎమ్మెల్యేలు శంకరనారాయణ, తిప్పేస్వామి, ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ కార్యాలయాలకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చారు. బొకేలు, పూలమాలలతో సత్కరిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. మరో వైపు అన్ని ఆలయాలు, చర్చీల్లో ప్రత్యేక ప్రార్థనలు, పూజలు జరిగాయి.

– సాక్షిబృందం



మడకశిర రూరల్: బాబా ఆలయం దగ్గర భక్తులకు ప్రసాదాన్ని పంపిణీ చేస్తున్న దృశ్యం



రొళ్ల: రత్నగిరి కొల్హాపురి మహాలక్ష్మీదేవి ఆలయంలో క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ట్రస్ట్ సభ్యులు



మడకశిరరూరల్: నీలకంఠాపురంలో చిన్నారులకు కేక్ తినిపిస్తున్న మాజీ మంత్రి రఘువీరారెడ్డి



పావగడ: సీఐ కాంతారెడ్డిని సన్మానించిన పోలీసులు



మడకశిర: క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ



అమరాపురం:ప్రత్యేక అలంకరణలో సిద్ధేశ్వరస్వామి

రక్తదాన శిబిరానికి స్పందన



సంజీవని బ్లాడ్ బ్యాంక్ ప్రతినిధుల నుంచి ప్రశంస పత్రాలు అందుకుంటున్న దృశ్యం

రొళ్ల: స్థానిక లక్ష్మీనరసింహస్వామి కమ్యూనిటీ భవనం ఆవరణంలో ఆదివారం తాలూకా కుంచిటి వక్కలిగ సంఘం అధ్యక్షుడు, స్థానిక జెడ్పీటీసీ సభ్యుడు బి.అనంతరాజు పుట్టినరోజు వేడుకలను పురస్కరించుకుని కర్ణాటక రాష్ట్రం తుమకూరు జిల్లా కేంద్రం సంజీవని బ్లాడ్ బ్యాంక్ ప్రతినిధులు నిర్వహించిన రక్తదాన శిబిరానికి స్పందన లభించింది. మొత్తం 66 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కుంచిటి వక్కలిగ ప్రతినిధులు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరై నూతన సంవత్సరం, పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. తర్వాత రొళ్ల నరసింహస్వామి, అయ్యప్ప స్వామి, రత్నగిరి కొల్హాపురి మహాలక్ష్మీదేవి, జీరిగేపల్లి అమ్మాజి, కొత్తపాళ్యం వెంకటేశ్వర స్వామి తదితర ఆలయాల్లో విశేష పూజలు చేశారు.

క్రీడాకారిణికి సన్మానం



క్రీడాకారిణి రితు ను సన్మానిస్తున్న దృశ్యం

పావగడ: తాలూకా లోని సీకే పురం గ్రామానికి చెందిన క్రీడాకారిణి రితును స్థానిక హెల్ప్ సొసైటీ అధ్యక్షుడు మానం శశి కిరణ్ ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో 800 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానంలో నిలిచి పావగడకు వన్నె తెచ్చిన క్రీడాకారిణి రితును సన్మానించడం గర్వ కారణంగా ఉందన్నారు. రిటైర్డ్ పీఈటీ హనుమంతరాయ మాట్లాడుతూ పేద కుటుంబంలో జన్మించిన రితు 8వ తరగతి లోనే ప్రతిష్టాత్మక అభ్యాస్ శిక్షణ కేంద్రానికి క్రీడా రిజర్వేషన్‌లో ఎంపికై అథ్లెటిక్స్ పోటీల్లో రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణించిందని కొనియాడారు. కార్యక్రమంలో రితు తల్లితండ్రులు బోయ మహలింగప్ప, జయమ్మ, సంధ్య శశి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన సత్రానికి విరాళం

లేపాక్షి: లేపాక్షిలోని వీరభద్రస్వామి దేవాలయానికి సమీపంలో దాతల సహకారంతో నిర్మిస్తున్న అన్నదాన సత్రం నిర్మాణానికి లేపాక్షికి చెందిన మల్లన్నగారి వెంకటరమణప్ప జ్ఞాపకార్థం ఆయన కుమారులు మాజీ ఎంపీపీ ఆనంద్‌కుమార్, గంగాధర్‌లు రూ.20,116 విరాళాన్ని కమిటీ సభ్యులకు అందజేశారు. అదేవిధంగా బెంగళూరుకు చెందిన మురళీచరణ్, ఆంజనేయులు రూ.6 వేలు అందించారు.

లేపాక్షిలో పర్యాటకుల సందడి

లేపాక్షి: లేపాక్షి వీరభద్రస్వామి దేవాలయానికి ఆదివారం పర్యాటకులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. దీంతో లేపాక్షి పరిసర ప్రాంతాలు సందడిగా మారాయి. ఆలయంలోని శిల్పాలు, చిత్రలేఖనాలను తిలకించడానికి పర్యాటకులు పోటీ పడ్డారు. అలాగే నందివిగ్రహం, థీం పార్కు, జటాయువు పక్షి తదితర ప్రదేశాల్లో కిటకిటలాడాయి. బస్టాండు, తుర్పు, పడమట గేట్‌లు పర్యాటకుల వాహనాలతో నిండిపోయాయి. ఈ సందర్భంగా ఆలయంలో దుర్గాదేవి, వీరభద్రస్వామి, పాపనాశేశ్వరస్వామి, రఘునాథ స్వాములకు ప్రత్యేకంగా అలంకరించి విశేషంగా పూజలు నిర్వహించారు.



గర్భగుడిలో పర్యాటకుల సందడి



అలంకరణలో దుర్గాదేవి